సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం ౹ 21 ౹ ఏప్రిల్ ౹ 2024



టన్ను చీనీ రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 691 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
39.4°/ 22.3°

జిల్లా పరిధిలో శనివారం ఆకాశం మేఘావృతమై ఎండ ప్రభావం తగ్గినా.. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఫ్లయింగ్‌స్క్వాడ్ చురుగ్గా పని చేయాలి

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు చురుగ్గా పని చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా రూ.50 వేలకు మించి నగదు, ఆభరణాలు, వస్తువులు తరలించరాదన్నారు. నిబంధనలను అతిక్రమించి తరలిస్తూ పట్టుబడిన వాటిని త్రిసభ్య కమిటీ (డీఆర్‌డీఏ పీడీ, జిల్లా సహకార శాఖ అధికారి, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్)కి స్వాధీన పరచాలన్నారు. సీజ్ చేసిన నగదు, ఆభరణాలు, వస్తువులకు సంబంధించి 24 గంటల్లో ఆధారాలు సమర్పించి తీసుకెళ్లడానికి త్రిసభ్య కమిటీ ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు డీఆర్‌డీఏ పీడీని 91548 40096 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ దుర్మరణం



ఉమామహేశ్వరి (ఫైల్)

కదిరి అర్బన్: రోడ్డు ప్రమాదంలో కదిరి మండలం గంగన్నగారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి (45) దుర్మరణం చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... టీచర్ ఉమామహేశ్వరి, దివాకర్ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. దంపతులు తమ చిన్నకుమారుడు జయదీప్‌ను శుక్రవారం ఉదయం తిరుపతి జూనియర్ కళాశాలలో వదిలి కారులో తిరుగుపయనమయ్యారు. అర్ధరాత్రి కదిరి మండలం మొటుకుపల్లి సమీపంలోకి రాగానే టైరు బరెస్ట్‌వడంతో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త దివాకర్‌యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపడి గొర్రెల కాపరి మృతి



ఆకుల వీరప్ప (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి చెందిన ఘటన పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. దిగువచెర్లోపల్లికి చెందిన ఆకుల వీరప్ప(62) శనివారం ఉదయం గొర్రెలు, మేకలను మేత కోసం సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరుకునే సమయంలో వర్షం పడటంతో గ్రామ సమీపంలో ఓ చెట్టు కిందకు చేరుకున్నాడు. మేకలు, గొర్రెలు మాత్రం వర్షంలో తడుస్తూనే ఇంటికి వెళ్లిపోయాయి. వర్షం నిలిచినా ఇంటికి రాలేదని భార్య లక్ష్మీదేవి గ్రామ సమీపంలోని రోడ్డు వద్దకు వచ్చి చూడగా వీరప్ప విగతజీవిగా కనిపించాడు. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చి చూడగా అప్పటికే వీరప్ప మృతి చెందినట్లు గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు. పిడుగుపాటుకు వీరప్ప మృతి చెందడం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను కలచివేసింది. వీరప్పకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

'బాలయ్య బుర్ర నిండా చెడు ఆలోచనలే'



మాట్లాడుతున్న టీఎన్ దీపిక

హిందూపురం: నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ బుర్ర నిండా చెడు ఆలోచనలే ఉంటాయని, అలాంటి వ్యక్తికి అన్నీ చెడుగానే కనిపిస్తుంటాయని హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బాలకృష్ణ ఆలోచన తీరు ఎన్నడూ వక్రంగానే ఉంటుందన్నారు. బసవతారకం ఆస్పత్రి బిల్లులు రూ.4 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం బకాయి పెడితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బిల్లులను మంజూరు చేసి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని గుర్తుంచుకోవాలన్నారు. గొప్ప మనసున్న జగనన్న గురించి తప్పుడు ఆలోచనలు, వ్యంగ్య అర్థాలతో మాట్లాడడం మానుకోవాలని, లేకపోతే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీఖాద్రీ ఆలయం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి.. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.



లేపాక్షి మండలం పులమతిలో చింతకాయలు ఒలుస్తూ ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక



కదిరిలో జగనన్నకు అండగా ఉంటామని సంతోషంగా చెబుతున్న యువత... చిత్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మక్బూల్ అహ్మద్



అమరాపురం మండలం యర్రగుంటపల్లిలో రాట్నం వడుకుతున్న మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

ప్రచార పర్వం

జిల్లాలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. శనివారం ఎండల తీవ్రత తగ్గి వాతావరణం కాస్త చల్లగా ఉండటంతో అభ్యర్థులు ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. గత పాలన.. ప్రస్తుత పాలనకు గల తేడాను గమనించి సరైన నిర్ణయం తీసుకుని ఓటు వేయాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్

పేదల బడులపైనా అక్కసేనా?

ఇది అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మనబడి నాడు–నేడు' కింద పూర్తిచేసిన అదనపు తరగతి గది. నిర్మాణం పూర్తయి తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ స్కూల్‌కు మొత్తం 10 అదనపు తరగతి గదులు మంజూరు కాగా... వాటిలో రెండు పూర్తయ్యాయి. నాలుగు గదుల స్లాబ్ పూర్తి కాగా, దోర్లు కూడా బిగించారు. ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. పైన గదులకు ఈనెల 26న స్లాబ్ వేయనున్నారు. పనులు నిరాటంకంగా సాగుతున్నా.. ఆ పచ్చ పత్రికకు మాత్రం కనిపించలేదు.



పచ్చ పత్రిక.. పిచ్చి రాతలు

- 'మనబడి నాడు–నేడు'తో పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు
- అభివృద్ధి పనులు పూర్తి చేయలేదంటూ ఈనాడులో తప్పుడు రాతలు
- ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందనే అసత్య కథనం

అనంతపురం ఎడ్యుకేషన్: 'మనబడి నాడు–నేడు' కార్యక్రమంతో నిరుపేద వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం సమూలంగా మార్చేస్తోంది. ప్రతి స్కూల్‌లో నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా (ఆర్‌ఓ ప్లాంట్లు), విద్యుద్దీకరణతో పాటు ప్రతి గదికీ ట్యూబ్‌లైట్, ఫ్యాన్, మేజర్–మైనర్ మరమ్మతులు, విద్యార్థులు, టీచర్లకు ఫర్నీచరు, కిచెన్‌షెడ్లు, గ్రీన్‌చాక్ బోర్డు, ప్రహరీలు, అదనపు తరగతి గదులు, పెయింటింగ్ తదితర పనులు చేపడుతోంది. రెండు విడతలుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. తొలివిడతగా చేపట్టిన స్కూళ్లలో అన్ని పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రెండోవిడత పనులు జరుగుతున్నాయి. తొలివిడతలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,294 స్కూళ్లలో రూ. 435.97 కోట్లు ఖర్చు చేసి వసతులు కల్పించారు. రెండోవిడతగా 2,183 స్కూళ్లలో (వీటిలో ఎంపిక చేసిన జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలూ ఉన్నాయి) పనులు జరుగుతున్నాయి. ఇప్పటిదాకా రూ.322.04 కోట్లు ఖర్చు చేశారు. తక్కిన పనులు జరుగుతున్నాయి.

ఓర్వలేని 'పచ్చ' కళ్లు..

నిరుపేద పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కార్పొరేట్‌స్థాయిలో ఏర్పాటు చేస్తుండడంతో ఈనాడు రామోజీరావుకు నచ్చలేదు. ఎందుకంటే చంద్రబాబు హయాంలో చాలా ప్రభుత్వ స్కూళ్లలో యూరినల్స్, మరుగుదొడ్లు ఉండేవి కావు. కొన్నిచోట్ల ఉన్నా నీటి సదుపాయం లేక వాటిని ఉపయోగించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా బాలికలు, మహిళా టీచర్ల పరిస్థితి దయనీయంగా ఉండేది. పాఠశాలల చుట్టూ నివాసాలు ఉండడంతో బయటికి వెళ్లలేక, ఎవరితో చెప్పుకోలేక లోలోన మదనపడేవారు. పురుష టీచర్లు, బాలురు బహిరంగ ప్రదేశాలకు వెళ్లి అవసరాలు తీర్చుకునేవారు. అమ్మాయిలు, మహిళా టీచర్లు మాత్రం ఉదయం నుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేదాకా వ్యక్తిగత అవసరాలను అదుపు చేసుకుంటూ అనారోగ్యాల పాలయ్యే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలాలేదు. నిరంతరం నీటి సదుపాయం ఉన్న మరుగుదొడ్లు, ప్రతి స్కూల్‌లోనూ ఆర్‌ఓ ప్లాంటు, ఫర్నీచరు ఏర్పాటయ్యాయి. దీంతో సహజంగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పేద వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో పూర్తిగా విశ్వాసం వచ్చింది. ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును జీర్ణించుకోలేని ఈనాడు పత్రిక విషం చిమ్మింది. ఎప్పటిలాగానే అబద్ధపు రాతలు వండింది. ఏ ఒక్క స్కూల్‌లోనూ అదనపు తరగతి గది నిర్మాణాలు పూర్తి కాలేదంటూ తప్పుడు కథనం రాశారు. అన్ని స్కూళ్లలోనూ పనులు జరుగుతున్నాయి. చాలా స్కూళ్లలో చివరిదశకు చేరుకున్నాయి. వేసవి సెలవుల్లో పూర్తి చేసి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



అనంతపురం రూరల్ విద్యారణ్యనగర్ స్కూల్‌లో మూత్రశాల

పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి



'మనబడి నాడు–నేడు' కింద ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. వివిధ దశల్లో ఉన్నాయి. వేసవి సెలవుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంఈఓలు, హెచ్‌ఎంలతో తరచూ సమీక్ష చేస్తున్నాం. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పనులన్నీ పూర్తవుతాయి.

– వరప్రసాదరావు, ఏపీసీ, సమగ్రశిక్ష

ఊపందుకున్న నామినేషన్లు

- మూడో రోజు మొత్తం 19 నామినేషన్లు
- అసెంబ్లీ స్థానాలకు 15, పార్లమెంటు స్థానాలకు 4 నామినేషన్లు



కదిరిలో నామినేషన్ వేస్తున్న సయ్యద్ మహమ్మద్ అఖిల్

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం మూడో రోజు శనివారం ఊపందుకుంది. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు 19 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 15, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారులు పేర్కొన్నారు. ఇందులో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా బీకే పార్థ సారథి, ఆయన భార్య కమలమ్మ ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ తరఫున నాగరాజు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా తాడిమర్రికి చెందిన కుల్లాయప్ప నామినేషన్ పత్రాలను కలెక్టర్ అరుణ్‌బాబుకు అందజేశారు.

- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థి నరసింహప్ప నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ అపూర్వ భరత్‌కు అందజేశారు. ధర్మవరం నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా చెర్లోపల్లికి చెందిన దాసరి కవిత నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ వెంకట శివరామిరెడ్డికి అందజేశారు. కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున సయ్యద్ మహమ్మద్ అఖిల్, బీఎస్పీ తరఫున రామచంద్ర నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ సన్నీ వంశీకృష్ణకు అందజేశారు.
- ఇక రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ తరఫున పరిటాల సునీత, పరిటాల శ్రీరాం ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. ఇండిపెండెంట్‌గా రఘురామయ్య నామినేషన్ దాఖలు చేశారు. తమ నామినేషన్లను ఆర్‌ఓ వసంతబాబుకు అందజేశారు. మడకశిర నియోజకవర్గంలో టీడీపీ తరఫున సునీల్‌కుమార్ బీఎస్పీ అభ్యర్థి ఇండీవర్ నామినేషన్లు దాఖలు చేశారు. తమ నామినేషన్లను ఆర్‌ఓ గౌరీశంకర్‌కు అందజేశారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎస్‌యుసీఐ (కమ్యూనిస్ట్) పార్టీ తరఫున రవీంద్ర, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మహమ్మద్ గౌస్ నామినేషన్లను ఆర్‌ఓ అభిషేక్‌కుమార్‌కు అందజేశారు.
- ఇక ఆదివారం ప్రభుత్వ సెలవురోజు కావడంతో నామినేషన్లు స్వీకరించరు.

'శ్రీ సత్యసాయి' డీఐఓ కృష్ణయ్య గుండెపోటుతో మృతి



కృష్ణయ్య (ఫైల్)

ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ కృష్ణయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఈయన స్వస్థలం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద అద్దె గదిలో ఒంటరిగా నివాసముంటున్న ఈయన శుక్రవారం అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో నొప్పి మొదలవడంతో జిల్లా వైద్యాధికారితో పాటు సహచర ఉద్యోగులకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి ఆయనను సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పల్స్‌రేటు పడిపోయింది. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండేవాడని, పౌరాణిక కళ ప్రదర్శనతో అందరికీ ఆనందాన్ని పంచేవాడని, అలాంటి మనిషి చనిపోయాడన్న విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. డీఐఓ మృతికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డితో పాటు పలువురు అధికారులు నివాళులర్పించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా



మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్

- పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్
- కలెక్టర్, ఎస్పీలతో సమీక్ష

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల్లో వ్యయ పరిమితికి మించి వెచ్చించే అవకాశమున్న అభ్యర్థుల ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అభ్యర్థుల ఎన్నికల వ్యయం పర్యవేక్షణ, సాధారణ ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రిథం భజ్వా, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అమిత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్లకు గాలం వేసే ప్రయత్నంలో నగదు, బహుమతుల పంపిణీపై సీ– విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ ఎన్నికల ప్రచారాన్ని తనిఖీ చేసే బృందాలు, వాటి పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చూయాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులు సహా గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అవగాహన కలిగుండాలన్నారు. బ్యాంకుల నుండి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, ముఖ్యంగా రూ.5 లక్షలకు మించి నగదు డిపాజిట్లు, మద్యం షాపులకు వెళ్లే సరుకు రవాణాపై నిరంతర నిఘా ఉండాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఎన్నికల వ్యయ పరిశీలన బృందాల పనితీరు గురించి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు కంట్రోల్ రూం, రాజకీయ ప్రచారానికి సంబంధించి అనుమతుల వివరాలు, ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు, తదితర అంశాలపై వివరించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోసం భారీ భద్రతా ఏర్పాట్లను వివరించారు. కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, వాటి పనితీరు, ఇప్పటి వరకూ సీజ్ చేసిన నగదు, మద్యం, బంగారం, ఎఫ్ఐఆర్‌ల వివరాలు తెలియజేశారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు రిథం భజ్వా సూచించారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. ఫిర్యాదుల పర్యవేక్షణ విభాగం, ఎంసీఎంసీ సెంటర్, మీడియా సెంటర్‌ను సందర్శించి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిథం భజ్వా మాట్లాడుతూ ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్, ప్రకటనలు, అభ్యర్థులపై వచ్చే పొగడ్తలు, విమర్శలు, హింసాత్మక ఘటనలపై తగిన నివేదికలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐఅండ్‌పీఆర్ ఏడీ వేలాయుధం, ఇంజినీరింగ్ అధికారి రామాంజనేయులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అబ్దుల్ ఖయ్యూం, కాల్‌సెంటర్ నోడలాఫీసర్ రామక్రిష్ణన్, ఎన్నికల అధికారి మైనుద్దీన్, ఏపీఆర్‌ఓ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టీడీపీ టికెట్‌పై ఉత్కంఠ



టీడీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

- అభ్యర్థి మార్పుపై అధిష్టానం పునరాలోచన
- సునీల్‌ను కొనసాగిస్తారా.. ఎంఎస్ రాజుకు కేటాయిస్తారా?
- అధిష్టానం నుంచి స్పష్టత లేక కేడర్‌లో అయోమయం

మడకశిర: టీడీపీ మడకశిర ఎమ్మెల్యే టికెట్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కుమార్‌కు టీడీపీ తొలుత టికెట్ కేటాయించింది. ఈ నిర్ణయాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో అధిష్టానం పునరాలోచనలోపడింది. ఈ క్రమంలోనే టీడీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు టికెట్ కేటాయిస్తారనే ప్రచారం ఊపందుకుంది. అయితే దీనిపై ఇంతవరకు అధిష్టానం స్పష్టత ఇవ్వకపోవడంతో కేడర్‌లో ఉత్కంఠ పెరిగిపోతోంది. ఇదిలా ఉండగా టికెట్ మార్పు అంశం తెరపైకి రాగానే మాజీ ఎమ్మెల్యే ఈరన్న, తనయుడు సునీల్ అప్రమత్తమయ్యారు. కణేకల్లుకు వచ్చిన పార్టీ అధినేత చంద్రబాబును శుక్రవారం రాత్రి కలిశారు. అభ్యర్థిని మార్చొద్దంటూ ఇద్దరూ విన్నవించుకున్నారు. మరొకరికి టికెట్ ఇస్తే తమకు ఆత్మహత్యే శరణ్యమని చంద్రబాబు ఎదుట ఈరన్న వాపోయినట్లు సమాచారం. అభ్యర్థి ఎంపికకు సంబంధించి నివేదిక తెప్పించుకుని నిర్ణయం తీసుకుంటానని అధినేత చెప్పినట్లు తెలిసింది. సరైన హామీ కోసం సునీల్‌కుమార్ విజయవాడకు వెళ్లి నారా లోకేష్‌ను కలిశారు. తనకు అన్యాయం జరగకుండా చూడాలని విన్నవించుకున్నారు.

ఎంఎస్ రాజుకు అసంతృప్తి సెగ..

మడకశిర నియోజకవర్గం నుంచి ఎంఎస్ రాజు పోటీ చేసే అంశాన్ని టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. 'నాన్ లోకల్ వద్దు....లోకలే ముద్దు' అంటూ ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా కూడా టీడీపీ కార్యకర్తలు మాట్లాడుతున్నారు. ఎక్కడి చెత్తనో తీసుకొచ్చి ఇక్కడ వేయడం న్యాయమా? అని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంఎస్ రాజు కూడా కణేకల్లు పర్యటనలో చంద్రబాబుతో భేటీ అయినట్లు తెలుస్తోంది. అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

టీడీపీ కార్యకర్తల నిరసన

మడకశిర: మడకశిర టీడీపీలో టికెట్ మార్పు ప్రచారం మరింత చిచ్చు పెట్టింది. సునీల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని మారుస్తారని ప్రచారం జరుగుతుండడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సునీల్ ముద్దు....నాన్ లోకల్ వద్దంటూ నినాదాలు చేశారు. సునీల్‌నే అభ్యర్థిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి సమీపంలో బావి వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన స్థానికులు బావి నీటిలో తెలియాడుతున్న మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. రెండు రోజుల క్రితం బావిలో పడి మృతి చెందినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆత్మహత్యనా? హత్య చేసి బావిలో పడేశారా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రెండు రోజుల వరకూ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచుతామని, సంబంధీకులు ఎవరూ రాకపోతే మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా ఖననం చేయిస్తామని సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు.

స్వపక్షానికే కండువాలు!



టీడీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలో చేరినట్లుగా ప్రకటిస్తున్న సవితమ్మ

గోరంట్ల: ప్రజల్లో ఆదరణ కోల్పోయిన టీడీపీకి బలముందని నిరూపించుకునేందుకు ఆ పార్టీ నాయకులు నానా తిప్పలు పడుతున్నారు. ఈ క్రమంలో సొంత పార్టీలోని వారికే కండువాలు కప్పి టీడీపీలో చేరినట్లుగా ప్రచారానికి తెరలేపారు. గోరంట్ల మండలం పులేరులో ఈ తరహా కుట్ర వెలుగు చూసింది. పెనుకొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సవితమ్మ ఇటీవల టీడీపీ సభ్యత్వం కలిగిన కొందరికి పార్టీ కండువాలను కప్పి గిమ్మిక్కు చేయడం చర్చనీయాంశమైంది. పులేరు గ్రామానికి చెందిన సాంబశివా, లక్ష్మీపతి ముందు నుంచి టీడీపీలోనే కొనసాగుతూ వస్తున్నారు. తిరిగి వారికే కండువాలు కప్పి పార్టీలో చేరినట్లుగా ప్రకటించడాన్ని గమనించిన ప్రజలు అవాక్కయ్యారు. సవితమ్మ తీరును ఏవగించుకున్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

వజ్రకరూరు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన విశ్వేశ్వరరావు (19) శనివారం ఉదయం పామిడిలో తన స్నేహితుడి రిసెప్షన్ వేడుకకు హాజరై, ట్రాక్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గ మధ్యంలో కమలపాడు వద్దకు చేరుకోగానే అదుపు తప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

నామినేషన్ల వేళ ముమ్మర తనిఖీలు

- చెక్‌పోస్టుల్లో సిబ్బంది అప్రమత్తం
- ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే జిల్లాలోకి అనుమతి
- మద్యం, గిఫ్ట్ సామగ్రి అక్రమ రవాణా కట్టడి

హిందూపురం అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంటోంది. ఈ నెల 22, 23, 24 బలమైన ముహూర్తాలు ఉండడంతో ఆయా రోజుల్లో పెద్ద ఎత్తున నామినేషన్లు వేసేందుకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులూ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో భారీ ర్యాలీల నిర్వహణకు పథకం రచించారు. మద్యంతో పాటు బిర్యానీ ప్యాకెట్లను ఎరగా వేసి ర్యాలీలో భారీగా జన సమీకరణకు రంగం సిద్ధం చేశారు. దీంతో పోలీసులు, ఎన్నికల అధికారుల కళ్లు గప్పి పొరుగున ఉన్న కర్ణాటక నుంచి మద్యం దిగుమతి చేసుకునే అక్రమాలకు తెరలేపారు. ఈ చర్యలను ఎక్కడికక్కడ చెక్‌పోస్టు సిబ్బందితో పాటు సెబ్ అధికారులు, పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.



రెండు రోజుల క్రితం చెక్‌పోస్టు వద్ద తప్పించుకుని కర్ణాటక నుంచి లేపాక్షి మీదుగా జిల్లాలోకి ప్రవేశిస్తున్న ఇన్నోవా వాహనాన్ని పోలీసులు అడ్డుకుని పరిశీలించారు. అందులో 30 బాక్సుల్లో తరలిస్తున్న మద్యం బయటపడింది. దీంతో ఇన్నోవా వాహనాన్ని సీజ్ చేసి, కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న సోమందేపల్లికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులోని గ్రామాల్లో తరచూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తూ ఉన్నాయి. నామినేషన్ల ప్రకియ జరుగుతుండడంతో ర్యాలీలో పాల్గొనే జనానికి మద్యంతో పాటు బిర్యానీ ప్యాకెట్లను అభ్యర్థులు సరఫరా చేస్తుండడమే అక్రమ రవాణాకు కారణంగా తెలుస్తోంది. 20 రోజుల క్రితం కర్ణాటక నుంచి హిందూపురానికి ఓ జీప్‌లో మద్యం తరలిస్తూ టీడీపీ నాయకులు పట్టుబడడమే ఇందుకు నిదర్శనం.

రూ.అర కోటికి పైగా మద్యం పట్టివేత..

మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంతరాష్ట్ర తనిఖీ కేంద్రాలతో పాటు, రాష్ట్ర రహదారులు, కర్ణాటక నుంచి వచ్చే గ్రామీణ రహదారుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకూ రూ.53 లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని సీజ్ చేశారు. అయితే సెబ్ అధికారులు, పోలీసు యంత్రాంగం ఎంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నా... వాదరి కళ్లుగప్పి అడ్డదారుల్లో మద్యం తరలిస్తుండడం ఇటీవల వెలుగు చూసింది. కర్ణాటక సరిహద్దున ఉన్న గ్రామీణ రహదారుల మీదుగా రోజూ 20 వేల టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని జిల్లాలోకి అక్రమంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 145 కిలోమీటర్ల సరిహద్దు కర్ణాటకకు అనుకుని ఉంది. దీంతో గ్రామీణ రహదారుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ప్రత్యేక టీమ్‌లతో తనిఖీలు ముమ్మరం చేశారు.

మరింత మంది రంగంలోకి..

కర్ణాటక సరిహద్దు సెబ్ స్టేషన్లు, తనిఖీ కేంద్రాలకు మరింత సిబ్బందిని పెంచి పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఉన్న సిబ్బందికి తోడుగా తూమకుంట, అగళి, కొడికొండ చెక్‌పోస్టులతో పాటు కదిరి, కళ్యాణదుర్గం సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు మరింత కట్టుదిట్టం చేయనున్నారు. ఈ క్రమంలో ఆయా చెక్‌పోస్టుల్లో సిబ్బందిని పెంచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

నగదు సీజ్



నగదును చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ధర్మవరంలోని ఎర్రగుంట వై జంక్షన్ వద్ద శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన అమర ఆదిశేషయ్య రూ.96,910 నగదు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు తరలిస్తుండడమే కాక, వాటికి సంబంధించి ఎలాంటి రసీదులు, బిల్లులు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు వివరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ ఓబుల నరసింహులు, కానిస్టేబుల్ వన్నూరప్ప, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్‌పోలీసులు

పుట్టపర్తి టౌన్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేశారు. శనివారం ఉదయం పుట్టపర్తి మండలం పెడపల్లి ఆర్చ్ వద్ద సెబ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది రూట్ వాచ్ చేస్తుండగా కారులో తరలిస్తున్న 672 టెట్రా ప్యాకెట్ల గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న నరసింహమూర్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, కన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

1,056 టెట్రా ప్యాకెట్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

కొత్తచెరువు: మండలంలోని కొడపగానిపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 11 కేసుల కర్ణాటక మద్యాన్ని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను వాసుదేవన్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సీఐ రాజారమేష్ ఆధ్వర్యంలో పోలీసులు కొడపగానిపల్లి వద్ద శనివారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లికి చెందిన వి.చంద్రశేఖర్, బళ్లారి శివయ్యను ఆపి తనిఖీ చేయడంతో సంచిలో 11 కేసుల్లో తరలిస్తున్న 1,056 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం బయటపడింది. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

వెబ్‌సైట్‌లో 'గురుకుల' హాల్‌టికెట్లు

పరిగి: గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 25న జరిగే రాత పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ఏపీ గురుకుల విద్యాలయ విద్యాసంస్థల జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ ఎన్వీ మురళీధర్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతితో పాటు 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశానికి ఏపీ గురుకుల విద్యా సంస్థల కమిషనర్ ఆదేశాల మేరకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https:// aprs. apcfss. in/ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడు చేసుకుని పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఈ నెల 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అలాగే జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

గురుకులాల్లో మిగుల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- బాలురకు 26న, బాలికలకు 29న

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాలు/అంబేడ్కర్ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మిగులు సీట్ల భర్తీకి బీఆర్‌ఏజీ సెట్–2024 ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మార్కుల ఆధారంగా అవకాశం ఇవ్వనున్నారు. బాలుర పాఠశాలలో 110, బాలికల పాఠశాలలో 120 ఖాళీలను 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ చేపట్టనున్నారు.

- బాలురకు సంబంధించి ఎస్సీ కేటగిరిలో 46 నుంచి 20 మార్కుల వరకు (జెండర్ ర్యాంక్ 83 నుంచి 8,266 వరకు), ఎస్టీ కేటగిరీలో 46 నుంచి 30 మార్కుల వరకు (జెండర్ ర్యాంక్ 137 నుంచి 3,352 వరకు), బీసీ కేటగిరీలో 49 నుంచి 47 మార్కుల వరకు (జెండర్ ర్యాంక్ 8 నుంచి 54 వరకు), ఓసీ కేటగిరీలో 48 నుంచి 46 మార్కులు (జెండర్ ర్యాంక్ 28 నుంచి 115 వరకు) పొందిన బాలురకు ఈ నెల 26న నార్పల మండలం బి.పప్పూరు గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ ఉంటుంది.
- బాలికలకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 46 నుంచి 19 మార్కుల వరకు (జెండర్ ర్యాంక్ 74 నుంచి 11,148 వరకు), ఎస్టీ కేటగిరీలో 40 నుంచి 27 మార్కుల వరకు (జెండర్ ర్యాంక్ 617 నుంచి 5,624 వరకు), బీసీ కేటగిరీలో 49 నుంచి 44 మార్కుల వరకు (జెండర్ ర్యాంక్ 11 నుంచి 232 వరకు), ఓసీ కేటగిరీలో 50 నుంచి 44 మార్కులు (ర్యాంక్ 01 నుంచి 243 వరకు) పొందిన బాలికలకు ఈ నెల 29న అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ ఉంటుంది.
- మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు ఎంపికైన వారి సమాచారాన్ని దరఖాస్తు సమయంలో పేర్కొన్న మొబైల్ నంబర్‌కు సమాచారం అందజేశారు. ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. విద్యార్థులు తమ మెరిట్ కార్డు, నాల్గో తరగతి స్టడీ, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకెళ్లాలి.

ఉద్యానానికి రూ.18.18 కోట్ల ఇన్‌పుట్

- గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 10,995 మంది రైతులకు సకాలంలో చేకూరిన లబ్ధి
- ఏటా దెబ్బతీస్తున్న వడగళ్లు, అకాల వర్షాలు, పెను గాలులు
- పంట నష్టానికి సీజన్ ముగిసేలోపు రైతులకు పెట్టుబడి రాయితీ



పెను గాలులకు నేలవాలిన అరటి (ఫైల్)

ఉద్యాన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల ఇలా...

సంవత్సరం	దెబ్బతిన్న విస్తీర్ణం	బాధిత రైతులు	పరిహారం
2019	159.35 హెక్టార్లు	259 మంది	రూ.34.93 లక్షలు
2020	609.40 హెక్టార్లు	741 మంది	రూ.125.36 లక్షలు
2021	961.67 హెక్టార్లు	1,182 మంది	రూ.173.71 లక్షలు
2022	4,393.66 హెక్టార్లు	5,317 మంది	రూ.759.73 లక్షలు
2023	3,149.65 హెక్టార్లు	3,496 మంది	రూ.724.12 లక్షలు
మొత్తం	9,273.73 హెక్టార్లు	10,995 మంది	రూ.18.18 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీగా పేరొందిన అనంతపురం జిల్లాలో పండ్లతోటల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా సాయం అందిస్తోంది. కరువును అధిగమించాలంటే ఉద్యాన రంగాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రంగానికి పెద్దపీట వేశారు.. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద ఏటా వివిధ పథకాల అమలుతో పాటు చీనీ, దానిమ్మ, అరటి, టమాట, ద్రాక్ష లాంటి పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేసి పెద్ద ఎత్తున పరిహారం అందజేశారు. వీటితో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పండ్లతోటల రైతులకు పెట్టుబడి సాయం (ఇన్‌పుట్‌సబ్సిడీ) అందిస్తూ అండగా నిలిచారు. అది కూడా గతంలో చంద్రబాబు ప్రభుత్వంలా చిన్నచూపు చూడకుండా ఏ సీజన్‌లో దెబ్బతిన్న పంటలకు అదే సీజన్‌లోనే పరిహారం ఇచ్చి ఆదుకుంటుండడం గమనార్హం.

రూ.18.18 కోట్లు ఇన్‌పుట్..

ఏటా ఏప్రిల్, మే నెలల్లో సంభవించిన పెను గాలులు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న అరటి, బొప్పాయి, జామ, సపోటా, మామిడి, ఆకు, వక్క, టమాట తదితర అన్ని రకాల ఉద్యాన పంటలను క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేసి ఈ–క్రాప్ ఆధారంగా అత్యంత పారదర్శకంగా పరిహారం ఇస్తూ వస్తున్నారు. గత ఐదేళ్లలో 9,273.73 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలకు 10,995 మంది ఉద్యాన రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.18.18 కోట్ల వరకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) పరిహారాన్ని నేరుగా జమ చేయడంతో రైతులు నష్టాలను అధిగమించారు. ఇందులో అనంతపురం జిల్లాలో 7,896.63 హెక్టార్ల దెబ్బతిన్న పంటలకు 8,997 మంది రైతులకు రూ.15.35 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 1,377.07 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలకు 1,988 మంది రైతులకు రూ.2.83 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. గతంలో ఈ ఏడాది దెబ్బతింటే వచ్చే ఏడాదికి కాని పరిహారం అందే పరిస్థితి లేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. చాలా సార్లు చంద్రబాబు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టి రైతులను దగా చేసిన దాఖలాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

కలకలం రేపిన లారీ

- వెంటాడిన పోలీసులు ..
- ఆపకుండా దూసుకెళ్లిన డ్రైవర్
- పట్టణ నడిబొడ్డున వదలేసి ఉడాయింపు



రోడ్డు మధ్యలో నిలిపిన లారీ

పెనుకొండ: పట్టణంలో శనివారం సాయంత్రం ఓ లారీ కలకలం రేపింది. షీప్ ఫారం ప్రాంతంలో స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో కర్ణాటక ప్రాంత నుంచి రొద్దం మీదుగా ఓ లారీ వచ్చింది. డ్యూటీలో ఉన్న స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాన్ని ఆపాలని సైగలు చేసినా డ్రైవర్ ఆపకుండా ముందుకు దూసుకెళ్లాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పట్టణ పోలీసులు లారీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో లారీని డ్రైవర్ వెంటనే రాంగ్‌రూట్‌లోకి మళ్లించి మరింత వేగంగా ముందుకెళ్లిపోయాడు. ఇక పోలీసులు తనను చుట్టుముడతారని భావించిన డ్రైవర్... పెనుకొండ నడిబొడ్డుకు చేరుకోగానే రోడ్డుపైనే వాహనాన్ని ఆపి కిందకు దిగి పరుగు తీశాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే విషయం తెలుసుకున్న స్థానికుల్లో ఉత్కంఠ నెలకొంది. లారీలో పెద్ద ఎత్తున డబ్బు, మద్యం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ప్రజల సమక్షంలోనే లారీని పోలీసులు తనిఖీ చేయడంతో అందులో సిమెంట్ పరిశ్రమకు తరలిస్తున్న మట్టి ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ పోలీసులకు భయపడి లారీని వేగంగా నడిపినట్లుగా గుర్తించారు.

ఒంగోలు కోడెకు అరుదైన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కోడె దూడ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన రైతు సుంకిరెడ్డి పెంచుకుంటున్న ఒంగోలు జాతి కోడె దూడకు శనివారం శింగనమల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభం అరుదైన శస్త్రచికిత్స చేశారు. వివరాలు... గత పది రోజులుగా తన కోడె దూడ మూత్ర విసర్జన చేయకపోవడాన్ని గమనించిన రైతు సుంకిరెడ్డి గార్లదిన్నె పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌ను సంప్రదించారు. కోడె దూడను పరీక్షించిన వెంటనే శింగనమల పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభానికి రెఫర్ చేశారు. ఆయన సూచన మేరకు అనంతపురంలోని పశువైద్యశాలకు కోడె దూడను తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. మూత్రనాళంలో రాళ్లు అడ్డు పడినట్లుగా గుర్తించి, మూత్రం రాక మూత్రాశయం పగిలిపోయిందని, దీంతో పది రోజులుగా మూత్రమంతా కడుపులోనే చేరుకున్నట్లుగా గుర్తించిన ఆయన రైతు అంగీకారంతో కోడె దూడకు శస్త్రచికిత్స నిర్వహించారు. కడుపులో చేరుకున్న 50 లీటర్ల మూత్రాన్ని వెలికి తీసి, యురినరీ క్యాథటర్‌ను ఏర్పాటు చేశారు. రెండు నుంచి మూడు వారాల్లో రాళ్లు కరిగి మూత్రనాళం యథాస్థితికి వస్తుందని, అప్పుడు క్యాథటర్‌ను తొలగించనున్నట్లు డాక్టర్ పద్మనాభం తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం కోడె దూడ కోలుకుంటున్నట్లు రైతు తెలిపారు. శస్త్రచికిత్సలో సంచార పశువైద్య వాహన డాక్టర్ సునీత, మహేష్, గీత, నారాయణస్వామి పాల్గొనగా, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సహకరించినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లికి చెందిన బోయ రమేష్ (27) గతంలో కియా అనుబంధ పరిశ్రమలో పనిచేసేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిస కావడంతో విధులకు సక్రమంగా హాజరు కాక జులాయిగా తిరగడం మొదలు పెట్టాడు. తన అవసరాలు తీర్చుకునేందుకు అప్పులు చేసి, వాటిని తీర్చలేక జీవితంపై విరక్తితో శుక్రవారం రాత్రి దుద్దేబండ లెవల్ క్రాస్ సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం

ధర్మవరం అర్బన్: స్థానిక డీఎల్‌ఆర్ కాలనీ సమీపంలో శనివారం ఉదయం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జేబులో ఉన్న లేఖ ఆధారంగా మృతుడిని రామాంజనేయులు (55)గా గుర్తించారు. మానసిక ఒత్తిళ్లు తాళలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసి, జేబులో ఉంచుకున్నట్లుగా తెలిసింది. కాగా, మృతుడి వివరాలు తెలియరాలేదు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని హిందూపురం రైల్వే పోలీసులు కోరారు.

ఉత్సాహంగా వన భోజనాలు



వనభోజనాలకు వెళ్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లిలో వన భోజనాల కార్యక్రమం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఊరంతా ఉదయాన్నే ఖాళీ చేసి సమీప తోటలు, చింత వనానికి చేరుకున్నారు. ఈ క్రమంలో గంపలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లారు. ఊరిలోకి బయటి వారు ఎవరూ ప్రవేశించకుండా దారులకు కంపకొట్టారు. కొందరు యువకులు కాపలాగా నిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మహిళలు, పిల్లలు తోటల్లోనే ఉల్లాసంగా గడిపారు. గ్రామ దేవుడైన నెట్టికంటి ఆంజనేయస్వామి ఊరేగింపుతో సాయంత్రం ఇళ్లకు చేరుకున్నారు.